
www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శుక్రవారం
25.09.2026



భూములకు విముక్తి

నిషేధిత ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అనుమతి

- అనుమతి ఉన్న ప్లాట్లు, భవనాలకే వర్తింపు
- తక్షణమే అమల్లోకి ప్రభుత్వ ఉత్తర్వులు
- వేలాది మంది యజమానులకు ఊరట
- అక్రమాలపై విచారణకు ప్రత్యేక కమిటీ
- శ్రీదేవసేన నేతృత్వంలో ఉన్నతస్థాయి బృందం



కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 25) : రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది.

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన ఆస్తులకు ఊరట కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన అనుమతులు ఉన్న లేఅవుట్లు, ప్లాట్లు, భవనాల రిజిస్ట్రేషన్లకు తక్షణమే అనుమతినిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న స్థిరాస్తి లావాదేవీలకు లైన్ క్లియర్ చేయడంతో పాటు, గతంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు సీనియర్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని రంగంలోకి దించింది.

అనుమతులు ఉన్న ఆస్తుల బదిలీకి మార్గం సుగమం

సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు.

దరఖాస్తుతో ఆంక్షలు తొలగించుకునే వెసులుబాటు

ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. అవసరమైన పత్రాలను సమర్పిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం ఆంక్షలు ఎత్తివేసేలా అధికారులు చర్యలు తీసుకుంటారు.

శ్రీదేవసేన నేతృత్వంలో విచారణ కమిటీ ఏర్పాటు..

మరోవైపు 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన చైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉంటారు. 22ఏ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది. ఈ కమిటీ పరిధి కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇక ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక!

సుప్రీంకోర్టులో దానం పిటిషన్ తిరస్కరణ..

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 25) : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. ఉపఎన్నికలో పోటీ చేయాలని సూచించింది. పదవితో పాటు పార్టీ మారితే ఫిరాయింపు కిందకే వస్తుందని, అది తప్పని తేల్చి చెప్పింది. దీంతో హైకోర్టు తీర్పు అమల్లోకి రానుంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ గెలిచారు. 2024లో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఖైరతాబాద్ నియోజకవర్గం ఖాళీ అయినట్లు కూడా పేర్కొంది. ఆ తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. అయితే సుప్రీంకోర్టు ఆయన అభ్యర్థనను అంగీకరించలేదు. దీంతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి ఖాళీగా మారిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది.

సీఎం నివాసానికి దానం..

సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు దానం నాగేందర్ ఖైరతాబాద్ వినాయకుడి వద్దే ఉన్నారు. నిమజ్జన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. తీర్పు నేపథ్యంలో ఆయన అక్కడి నుంచి బయలుదేరి సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పు పట్ల బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 25.09.2026
2
www.kalamjyothi.com

అంబేద్కర్ భవనానికి రూ.30 లక్షలు

అవసరమైన నిధులను మంజూరు
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 25) : పట్టణంలోని అంబేద్కర్ భవనంలో అవసరమైన సౌకర్యాల కల్పన కోసం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రూ.30 లక్షల నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ బాధ్యులు కూచాడి శ్రీహరి రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అంబేద్కర్ భవన దుస్థితిని వివరించి వినతిపత్రం అందజేశారు. భవనం లోపల శబ్ద తరంగాలు ప్రతిధ్వనించకుండా రీ సౌండ్ రాకుండా చర్యలు చేపట్టాలని, అతిథుల సౌలభ్యం కోసం కుర్చీలు సమకూర్చడంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించి నిరుద్యోగుల కోసం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని భరోసా ఇచ్చినట్లు శ్రీహరి రావు పేర్కొన్నారు. ఆయన వెంట సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు కొంతం మురళీధర్, మధుకర్, అనిల్ తదితరులు ఉన్నారు.



ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఇల్లంతకుంట

ఎంపీడీవో శనికళ

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 25) : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్లాస్టిక్ రహిత సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, ఇల్లంతకుంటను ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి, ప్రత్యామ్నాయ సంచులను నిత్య జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛమైన గ్రామం సాధనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీఓ వహీద్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ ఎం.రాజు, ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మ, వార్డు సభ్యులు మామిడి సుశీల, అంతటి శ్రీకాంత్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు పొట్టి వెంకన్న, ఎర్రోజు రవితేజ, దయ్యాల మహేష్, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పర్యావరణహిత గణపతి

వాహనాన్ని ఆకులు, పూలతో అలంకరించి ఊరేగింపు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 25) : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో గణపతి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మట్టి గణపతితో పాటు నిమజ్జన వాహనాన్ని వివిధ రకాల ఆకులు, పూలతో అందంగా అలంకరించి డప్పు చప్పుళ్ల నడుమ గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంప్రదాయబద్ధంగా మంగళహారతులు ఇస్తూ, కోలాటాలు ఆడుతూ నిమజ్జనోత్సవంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఉపసర్పంచ్, గంగాధర క్షేత్ర పురోహితులు మూగు నారా శర్మ, మారుపాక అనిల్ కుమార్, షాదుల నిరంజన్, అంజాల సతీష్, రోడ్ల సుమన్, అంతటి పరశురాం తదితరులు పాల్గొన్నారు.





గణపయ్య లక్కీ డ్రాలో లడ్డూ దక్కించుకున్న మహమ్మద్ శోహైద్

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : మండలంలోని అక్కల్ చెడ (కట్టయ్యపల్లి) గ్రామంలో మిత్ర వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడి లడ్డూ ప్రసాదం లక్కీ డ్రాలో మహమ్మద్ శోహైద్‌కు దక్కింది. బుధవారం సాయంత్రం నిమజ్జన శోభాయాత్రకు బయలుదేరే ముందు గణనాథుడి చేతిలోని దివ్య లడ్డూ ప్రసాదం కోసం మొత్తం 250 కూపన్లతో లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో జనతా ఫర్టిలైజర్స్ నిర్వాహకులు మహమ్మద్ శోహైద్ విజేతగా నిలిచారు. ఈ ఫలితం రాగానే అక్కడున్న గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిత్ర వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, విగ్రహ దాత తూటి శ్రీనివాస్, కమిటీ అధ్యక్షులు ముత్యం చేరాలు, గౌరవ అధ్యక్షులు కోరే రమేష్, కక్కెర్ల శ్రీనివాస్, కోశాధికారి జీనికిరి రాజ్ కుమార్, కాటి హరీష్, లకిడి ప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 25) : పట్టణంలో ఈ నెల 25న నిర్వహించనున్న గణేష్ నిమజ్జన మహోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని బాసర జోన్-2 డీఐజీ ఆర్. భాస్కరన్ ఆదేశించారు. బుధవారం నిర్మల్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు జిల్లా పోలీస్ అతిథి గృహం వద్ద ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జన శోభాయాత్ర మార్గాలు, బందోబస్తు ప్రణాళికలు, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల నిరంతర నిఘా, భక్తుల భద్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బాసరలో గణేష్ నిమజ్జనం జరిగే గోదావరి తీర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తయ్యేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, బాసర సీఐ దీపక్, శ్రీకాంత్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

శుక్రవారం 25.09.2026

www.kalamjyothi.com



పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏలేటి సంఘీభావం

ఎస్టీటెట్ స్వతంత్రతను కాపాడి

విద్యా ప్రయోజనాలను పరిరక్షించాలి

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 25) : సాంకేతిక విద్యా వ్యవస్థ మనుగడకు, డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పాలిటెక్నిక్ విద్యార్థులు బుధవారం చేపట్టిన నిరసన ధర్నాకు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ధర్నా శిబిరానికి చేరుకున్న ఆయన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యా రంగాన్ని యథావిధిగా సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని, ఎస్టీటెట్ స్వయంప్రతిపత్తిని దెబ్బతీయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశాల్లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ప్రయోజనాలకు భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్, దొడ్డికింది ముత్యంరెడ్డి, జమాల్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.



డీసీవోను కలిసిన సొసైటీ బృందం

సొసైటీ అభివృద్ధికి,

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : జిల్లా సహకార అధికారి (డీసీవో) నీరజను అమీనాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, పాలకవర్గ డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచనల మేరకు సొసైటీ పరిధిలోని పలు సమస్యలను, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. సొసైటీ పరిధిలోని రైతాంగానికి మెరుగైన సేవలందించేందుకు, పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు శాఖాపరంగా పూర్తి సహకారం అందిస్తామని డీసీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, డైరెక్టర్ సిద్దన రమేష్, డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, సర్పంచ్ దార రంజిత్, ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి వల్లే సాగునీటికి ఇబ్బంది

కాలువల వెడల్పు కుదించి

ఆయకట్టు రైతులకు తీవ్ర ద్రోహం :

మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 25) : మంత్రి జూపల్లి కృష్ణారావు వైఫల్యాల పల్లే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్దన్ రెడ్డి విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది మీటర్లు ఉండాల్సిన ప్రధాన కాలువల వెడల్పును ఏడు మీటర్లకు కుదించడం వల్లే చివరి ఆయకట్టుకు నీరందడం లేదని మండిపడ్డారు. మూడు టీఎంసీల నీటి కోసం మంత్రులు హెలికాప్టర్లలో కర్ణాటకకు వెళ్లడం విడ్డూరంగా ఉందని, సరైన ప్రణాళికతో రిజర్వాయర్లు నింపుకుంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లలో నాలుగేసి పంపులకు గాను రెండేసి మాత్రమే నడుస్తుండటంతో నీటి నిల్వలు పెరగడం లేదని, మరమ్మతులు చేపట్టి కొత్త మోటార్లు బిగించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం 24 గంటల విద్యుత్ అందించాలని, నార్లాపూర్-ఏదుల మధ్య ఉన్న మట్టిదిబ్బను వెంటనే తొలగించాలని కోరారు. సమావేశంలో నాయకులు బాలాగౌడ్, అర్థం రవి, లక్ష్మయ్య, అర్జునయ్య, విష్ణు చారి, భీముడు, భీమయ్య, సుబ్బయ్య, సత్యం, అహ్మద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులు స్వయం ఉపాధి పొందాలి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం

చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

దుగ్గొండి ఎస్సై దణధీర్‌రెడ్డి

కలంజ్యోతి, దుగ్గొండి (సెప్టెంబర్ 23) : సమాజంలో ఇతరులతో సమానంగా దివ్యాంగులు కూడా ప్రతిభను చాటుతూ అన్ని రంగాల్లో రాణించాలని, బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతూ స్వయం ఉపాధి సాధించాలని ఎస్ఐ రణధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో నేషనల్ ప్లాట్‌ఫామ్ ఫర్ రైట్స్ ఆఫ్ డిజేబిలిటీస్ అసోసియేషన్ సభ్యుల కోసం పీఎం ముద్ర యోజన, ఉద్యం రిజిస్ట్రేషన్‌పై బుధవారం ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ, పీఎం ముద్ర, పీఎం స్వనిధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరంగల్ జిల్లా పరిశ్రమల శాఖ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ మేనేజర్ సందీప్ కుమార్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించి చిరు వ్యాపారాల ఏర్పాటు, రాయితీలు, దరఖాస్తు ప్రక్రియను వివరించారు. ఎంపీఆర్‌డీ ఇండియా మండల అధ్యక్షులు చింత కుమారస్వామి అధ్యక్షత జరిగిన ఈ సభలో జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, సంఘం జిల్లా అధ్యక్షులు అడ్డా రాజు, కందికొండ రాజకుమార్, యారా శ్రీను, కరుణాకర్, ఎల్లస్వామి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందాలి

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 25) : తరగతి గది విద్యతో పాటు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక ప్రతిభను వెలికితీయాల్సిన అవసరం ఉందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్మల్ కేజీబీవీలో 25 సంవత్సరాల సేవ, సమర్పణ - అభివృద్ధి చెందిన భారతదేశం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. దేశాభివృద్ధి, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులు గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలు అందజేసి అభినందించారు. బాల్యం నుంచే దేశ భక్తి, సామాజిక స్పృహ కలిగి ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. ఇలాంటి పోటీలు భావి భారత పౌరులుగా వారిని తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ డీఈవో పద్మ తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
శుక్రవారం 25.09.2026
www.kalamjyothi.com



శ్రీహేమంత్ ఆసుపత్రితో గణపయ్య నిమజ్జనం

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 25) : పట్టణ కేంద్రంలోని శ్రీ హేమంత్ న్యూరో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి డాక్టర్లు, ఉద్యోగులు ప్రత్యేక హారతులు సమర్పించారు. చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు, స్థానిక ప్రజలకు కులమతాల భేదం లేకుండా పండ్లు, ఆహార పదార్థాలను అందజేశారు. శోభాయాత్రలో మహారాష్ట్ర బ్యాండ్ బృందం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. డప్పు దరువులకు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది లయబద్ధంగా కాలుకదిపి ఉత్సాహపరిచారు. మతసామరస్యంతో ప్రతి పండుగనూ కుటుంబ వేడుకలా నిర్వహిస్తూ సిబ్బందిని ప్రోత్సహిస్తున్న డాక్టర్ హేమంత్ కుమార్‌ను పలువురు అభినందించారు.





గంగమ్మ ఒడికి లంబోదరుడు

కలంజ్యోతి, గూడూరు (సెప్టెంబర్ 23) : మండల పరిధిలోని రాములు తండాలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న వినాయకుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. రాములు తండా యూత్ ఆధ్వర్యంలో గణపతి బప్పా మోరియా నినాదాలు, డీజే పాటల దరువుల నడుమ పురవీధుల్లో శోభాయాత్ర సాగింది. భక్తులు, యువకులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గణనాథుడిని సాగనంపారు. శోభాయాత్రలో గూడూరు మాజీ సర్పంచ్, ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండా ప్రజలతో పాటు మండల ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు, తండా యువకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో
గణపతి నిమజ్జనం చేయాలి



గూడూరు ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్, సబ్ ఇన్ స్పెక్టర్ రమేష్ బాబు

అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు

కలంజ్యోతి, గూడూరు (సెప్టెంబర్ 23) : భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో ఎలాంటి గొడవలకు తావులేకుండా వినాయక నిమజ్జనాలు జరుపుకోవాలని సీఐ వినయ్ కుమార్, ఎస్సై రమేష్ బాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రతిష్టించిన గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బుధవారం వారి చేతుల మీదుగా నిమజ్జనోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు తగలకుండా భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిమజ్జన కమిటీల సభ్యులు ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.



ఎద్దుల బండిపై శోభాయాత్ర

పురాతన సంస్కృతి ఉట్టిపడేలా గ్రామీణ రీతిలో నిమజ్జనం

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 25) : ఆధునిక హంగులకు భిన్నంగా పురాతన సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రెబల్ యూత్ ఆధ్వర్యంలో ఎద్దుల బండిపై గణనాథుడి నిమజ్జన శోభాయాత్రను నిర్వహించారు. కాలనీలో ప్రతిష్టించిన గణపతిని సంప్రదాయబద్ధంగా పూలతో ముస్తాబు చేసిన ఎద్దుల బండిపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. నాగర్‌కర్నూల్ పట్టణ చరిత్రలోనే తొలిసారిగా చేపట్టిన ఈ వినూత్న శోభాయాత్రను తిలకించేందుకు కాలనీవాసులు, మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గణపతి బప్పా మోరియా నినాదాలు, మంగళహారతుల నడుమ రెబల్ యూత్ ప్రతినిధులు, భక్తులు గణపయ్యను ఘనంగా సాగనంపి గంగమ్మ ఒడికి చేర్చారు.



పోటీపడి గణేష్ లడ్డూల కైవసం

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : మండలంలోని అమీనాబాద్ గ్రామంలో నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా లడ్డూ వేలం పాటను ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులు ఉత్సాహంగా పోటీపడగా, అమ్మ బక్కయ్య-వినోద దంపతులు రూ.12,500లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ రాజేష్, పల్లకొండ తిరుపతి, మేడి రాజకుమార్, మరాఠి రవి, అన్న రమేష్, ముస్కు రామకృష్ణ, అమ్మ మహేందర్, మేడి రమేష్, మల్లాడి వీరారెడ్డి, మిలకూరి రాజు, మరాఠి రాజు, మేడి సతీష్, అమ్మ వీరాస్వామి, మండల నరేందర్, నాంపల్లి రాజు, దుడే మహేందర్, పోతారాజు మహేష్, కంకటి కుమార్, మండల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాత మగ్ధంపురంలో శ్రీరామ వినాయక దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో మంచిక సాయి ప్రకాష్ గౌడ్ (బంటీ గౌడ్) లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

శుక్రవారం 25.09.2026

www.kalamjyothi.com

నీట్ పీజీలో శిరీషారెడ్డి ప్రతిభ

జాతీయ స్థాయిలో
11 వేల ర్యాంకు



కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 24) : గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి జాతీయ స్థాయి నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మండల కేంద్రానికి చెందిన యువ వైద్యురాలు పీసు శిరీషారెడ్డి మండల కీర్తిని చాటారు. గాలిపల్లి గ్రామానికి చెందిన పీసు ఎల్లారెడ్డి-సుజాత దంపతుల ద్వితీయ కుమార్తె అయిన శిరీషారెడ్డి జాతీయ స్థాయిలో 11 వేల ర్యాంక్ కైవసం చేసుకున్నారు. వరంగల్‌లోని ప్రతిష్టాత్మక కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె, పట్టుదలతో శ్రమించి నీట్ పీజీ పరీక్షకు సన్నద్ధమయ్యారు. మొదటి ప్రయత్నంలోనే ఉన్నత ర్యాంకు సాధించి పీజీ వైద్య విద్య ప్రవేశానికి అర్హత పొందారు. ఆమె సాధించిన విజయంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేయగా, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గుండెల్లి రాజు (40, తండ్రి: కొమ్మలు) ప్రమాదవశాత్తు సాగునీటి కాలువలో పడి ప్రాణాలు కోల్పోయాడు. గురువారం చోటుచేసుకున్న ఈ విషాదకర సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని, పలు అనుమానాలను రేకెత్తించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నివేదిక, సమగ్ర దర్యాప్తు అనంతరం మృతికి గల పూర్తి కారణాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

చెరువు గండిని పూడ్చిన రైతులు



కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : మండల పరిధిలోని ఎల్లయ్యగూడెం చెరువు కట్టకు పడిన గండి ద్వారా సాగునీరు వృథాగా పోతుండటాన్ని గమనించిన చెరువుకొమ్ము తండా రైతులు వెంటనే స్పందించి పరిష్కరించారు. పంటలకు ఆధారమైన నీరు వృథా కాకూడదనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా జేసీబీ యంత్రాన్ని సమకూర్చుకుని గండిని పటిష్టంగా మూసివేశారు. సకాలంలో శ్రమించి చెరువు నీటిని సంరక్షించిన అన్నదాతల చొరవను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బోడ రవి నాయక్, భూక్య ఊమ్లా, బాబు, బోడ ధంజ్యలతో పాటు గ్రామ నాయకులు, తండా రైతులు పాల్గొన్నారు.



ఊడుగుల సత్యనారాయణకు ఘన నివాళి

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : నాలుగు దశాబ్దాల క్రితం హనుమకొండలో స్థిరపడి లిటిల్ స్టార్ పబ్లిక్ స్కూల్ ద్వారా విద్యాదానం చేసిన మండలంలోని ఉప్పరపల్లి వాసి, ప్రముఖ విద్యావేత్త దివంగత ఊడుగుల సత్యనారాయణ గౌడ్ దశదిన కర్మ సంస్మరణ సభను హనుమకొండలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన సోదరులు శ్రీను, వివేక్, వేణు, శ్రావణ్, తోబుట్టువులు స్వరూప, చంద్రకళ, కుమారులు చాణక్య, గౌతమ్‌ల ఆధ్వర్యంలో ఈ సభ ఏర్పాటైంది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన సత్య నారాయణ గౌడ్ రాజకీయాల్లోనూ నిస్వార్థ సేవలు అందించారని వక్తలు గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్లాలని మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. అనంతరం ప్రజా కళాకారులు ఆయన వ్యక్తిత్వంపై ఆలపించిన గీతాలు సభికులను కంటతడి పెట్టించాయి. కార్యక్రమంలో చింతకింది అశోక్, కంరుద్దీన్, చింతల జయేందర్ రెడ్డి, మాటూరి కొమురయ్య, ఊడుగుల వీరస్వామి, మండ రామ్ నారాయణ, మేరుగు బాబు, చంద్రమౌళి, రాజు, రమేష్, బొమ్మెర కొమ్మల్, నరేందర్, వీరేష్, మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, సామాజికవేత్త జిలకర శ్రీనివాస్, గోప వ్యవస్థాపకులు జనార్దన్ గౌడ్, విద్యార్థి సునీల్ నాయక్, ప్రముఖ సినీ దర్శకులు వేణు ఊడుగుల మిత్రబృందం కొమ్మిరెడ్డి మధుకర్ రెడ్డి, సాయి, కళాకారులు యోచన, మానుకోట ప్రసాద్, మచ్చ దేవేందర్, నేర్నాల కిశోర్, రమాదేవి, తాళ్ల సునీల్, మైస ఎర్రన్న, శాలిని, బరిగేల రవి, యుగంధర్, సతీష్, హర్షవర్ధన్, సత్య నారాయణ గౌడ్ భార్య సరోజన పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుకగా కొప్ప నర్సింలు



కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 25) : సామాజిక, తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, సీనియర్ జర్నలిస్టు కామ్రేడ్ కొప్ప నర్సింలు 10వ వర్ధంతి సందర్భంగా హత్నూర మండల జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మండల పరిధిలోని దౌల్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక విలేకరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దళిత జర్నలిస్టుల ఫోరం జిల్లా సలహాదారు, సీనియర్ విలేకరి మీసంపల్లి కిషన్ రావు మాట్లాడుతూ నలభై ఏళ్ల పాటు మారుమూల పల్లెల్లో పెత్తందారుల దౌర్జన్యాలను తన కలం ద్వారా ఎండగట్టిన ధీరుడు నర్సింలు అని కొనియాడారు. 2001లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయినప్పటికీ తెలంగాణ సాధన కోసం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, వారి కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాతికేయులు వనరిగారి వీరేశం, పటేల్ పోచ గౌడ్, జైన సత్యం, బడంపేట రామస్వామి, మహమ్మద్ కరీం, రావులకోరి వెంకటేష్, మహమ్మద్ దస్తగిరి, బల్గురి బిక్షపతి, జక్కుల శ్రీనివాస్, నాయికోటి ప్రభాకర్, కొమురగళ్ల నాగేష్, పరమేశుల కిష్టయ్య, మహమ్మద్ జావేద్, మహమ్మద్ అబ్దుల్లా, మహిపాల్, సామాజిక నాయకులు నాగులపల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కాలేజీలో వినాయక నిమజ్జనం

ఏటా కళాశాలలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 25) : మండలంలోని దౌల్తాబాద్, కాసాల శివారులో గల సాయి రిషి ఒకేషనల్ కాలేజీలో పది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని సాగనంపారు. కళాశాల ప్రిన్సిపాల్ స్వామి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన, ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

'సిగ్మా' నుంచి సులోచన వచ్చేస్తున్నది

యంగ్ హీరో సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం సిగ్మా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస అప్డేట్లతో సందడి చేస్తోంది. తాజాగా చిత్ర ప్రీ రిలీజ్ వేడుకతో పాటు నాలుగో పాట విడుదల వివరాలను వెల్లడించింది. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సిగ్మా ప్రీ రిలీజ్ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే చిత్రం నుంచి నాలుగో పాట సులోచనను రాత్రి 8 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంతో కోలీవుడ్ స్టార్ విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, కోస్టల్ ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది.

